కడపలో పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చింది

రిటైర్డ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి

కడప అర్బన్ : తాను గతంలో పలు చోట్ల జడ్జిగా పని చేశానని, అయితే కడపలో జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన రోజులు ఎంతో సంతృప్తినిచ్చాయని రిటైర్డ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం పదవీ విరమణ పొందిన సందర్భంగా కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) అధ్యక్షుడు జీ.వి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు పీఎస్ బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి వై.టీ.జె కెనడీ, బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. రిటైర్డ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి మాట్లాడుతూ తాను పని చేసిన రెండు నెలల కాలంలోనే 75 కేసులను న్యాయవాదుల సహకారంతో పరిష్కరించగలిగానన్నారు. తనకు న్యాయవాదులు అందించిన సహకారం ఎన్నటికీ మరువలేనిదని చెప్పారు. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ.వి రాఘవరెడ్డి మాట్లాడుతూ న్యాయమూర్తిగా ఆయన పదవి విరమణ చేసినా, న్యాయవ్యవస్థకు దూరం కాదని తాము భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. అన్నపూర్ణమ్మ, ఆరవ అదనపు జిల్లా జడ్జి ఇంతియాజ్ అహ్మద్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి గీత, అడిషనల్ సబ్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత, న్యాయమూర్తులు స్రవంతి, నందిని, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


రిటైర్డ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి దంపతులను సన్మానిస్తున్న కడప బార్ అసోసియేషన్ వారు

వడ్డెర్ల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి

పులివెందుల రూరల్ : వడ్డెరుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర చైర్ పర్సన్ రేవతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబకపల్లె రోడ్డులో ఉన్న ఫిష్ ఆంధ్రా కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎక్కువ శాతం ఉన్న బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 130 బీసీ కులాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో 560 చైర్మన్లు, 672 డైరెక్టర్లను నియమించడం జరిగిందన్నారు. అందులో ఎక్కువ శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించారని పేర్కొన్నారు. వడ్డెరులకు ఉన్నతమైన పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. 2019 ఎన్నికలలో చెప్పిన విధంగా ఎమ్మెల్సీ స్థానాలు, మున్సిపల్ చైర్మన్, కార్పొరేషన్ చైర్మన్లు ఇచ్చి.. మాట నిలబెట్టుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వడ్డెర చైతన్య యాత్రలో భాగంగా పులివెందులకు రావడం జరిగిందన్నారు. అనంతరం ఆమెను వడ్డెర కులస్తులు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘ నాయకులు కొండయ్య, మునీంద్ర, ఏపీఎంలు ఆంజనేయులు, గురుమోహన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర చైర్ పర్సన్ రేవతి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

వివాహిత ఆత్మహత్య

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి పంచాయతీ పాతకోటపల్లికి చెందిన ఓ వివాహిత చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకొంది. సీఐ సురేష్ కుమార్ కథనం మేరకు.. పాతకోటపల్లికి చెందిన గంగాధర్ భార్య సరస్వతమ్మ (45) శుక్రవారం గ్రామ శివారు ప్రాంతంలోని చింతచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి సరస్వతమ్మ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై నాగేశ్వర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో..

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. పట్టణంలోని శేషప్పతోటకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు బాబు భార్య సోని(34) భర్త మందలించిన కారణంగా మాత్రలు మింగి ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. బాబు పనుల నుంచి రాత్రి ఇంటికి రాగా వారి ఇద్దరి పిల్లలు గొడవపడుతున్నారు. వారిని పట్టించుకోకుండా ఉన్న భార్య సోనిని పిల్లలను ఎందుకు పట్టించుకోవడం లేదంటూ మందలించాడు. అయితే అప్పటికే భార్యాభర్తల మధ్య, కుటుంబ సమస్యలతో మనస్పర్థలు ఉండటంతో మనస్తాపం చెందిన సోని ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు సోనిని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందజేశారు.

గోడ కూలి ముగ్గురికి గాయాలు

మదనపల్లె : మూడో అంతస్తుపై నిర్మిస్తున్న గోడ కూలి పక్కనే ఉన్న ఓ బంకుపై పడి ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మారుతీనగర్‌లో గుర్రప్ప(58) బార్బర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన రామకృష్ణ(60), రెడ్డెప్ప(52)లు షేవింగ్ కోసం అక్కడికి వచ్చారు. బార్బర్‌షాపు పక్కనే చలమయ్య ఇంటి నిర్మాణంలో భాగంగా మూడో అంతస్తులో నిర్మిస్తున్న గోడ.. సాయంత్రం నుంచి పడుతున్న వర్షానికి తడిసి ఉన్న పళంగా పక్కనున్న బార్బర్‌షాపుపై కుప్పకూలింది. దీంతో షాపులో ఉన్న యజమాని గుర్రప్ప, రామకృష్ణ, రెడ్డెప్ప తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో నుంచి పడి బిచ్చగాడికి గాయాలు

మదనపల్లె : బస్సులో నుంచి ప్రమాదవశాత్తు బిచ్చగాడు కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం జరిగింది. మదనపల్లెకు చెందిన దాసప్ప(65) బస్సులో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. అందులో భాగంగా ప్రతి రోజు మదనపల్లె నుంచి చీకలబైలు వరకు ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణిస్తూ భిక్షాటన చేసేవాడు. యథావిధిగా శుక్రవారం ఉదయం మదనపల్లెలో ఓ ప్రైవేట్ బస్సు ఎక్కి మదనపల్లె మండల సరిహద్దు అయిన చీకలబైలు వరకు వెళ్లాడు. బస్సులో నుంచి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అతడి కాలుపై బస్సు వెనుక చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్రాల గడ్డ సమీపంలో నివాసం వుంటున్న షేక్ జమాల్ అనే వ్యక్తి కుమారుడు షేక్ మహ్మద్ (14) అనే విద్యార్థి ఈనెల 26 నుంచి కనిపించడం లేదని శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఐదవ తరగతి వరకు చదువుకున్న షేక్ మహ్మద్‌ను ఆ పై తరగతులలో చేర్పించేందుకు సిద్ధం చేస్తుండగా విషయం తెలుసుకుని పరారయ్యాడు. అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.మధుసూధన్ రెడ్డి తెలియజేశారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

నిమ్మనపల్లె : యువకుడిపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం నిమ్మనపల్లెలోని బస్టాండ్ వద్ద అఫ్రోజ్‌అలీఖాన్(35)పై అదే గ్రామానికి చెందిన సమీప బంధువు ముఖాసిద్ధిక్ అలీఖాన్(42), మహమ్మద్ వసీంఖాన్(21), ఉత్తరప్రదేశ్‌కు చెందిన జేసీబీ డ్రైవర్ అన్సారీ అంజుమ్(21), క్లీనర్ అన్సారీ అమీముద్దీన్(19)తో కలిసి దాడికి పాల్పడ్డారు. బాధితుడు అఫ్రోజ్ ఫిర్యాదు మేరకు నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శుక్రవారం తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ

లింగాల : మండలంలోని అంకేవానిపల్లెలో పొలం గట్టుపై నిప్పు పెట్టారన్న విషయమై ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డాయి. దిద్దేకుంట శ్రీరామిరెడ్డి, దిద్దేకుంట కిశోర్‌రెడ్డి అనే ఇరు వర్గాల వారు కర్రలు, కొడవళ్లతో దాడి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ హృషికేశవరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను అదుపులోకి తీసుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

జగనన్న ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్లు


ఇళ్ల పట్టాలను అందజేస్తున్న అజయ్‌రెడ్డి

పెనగలూరు: జగనన్న ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్ల పట్టాలతోపాటు పక్కా గృహాలు మంజూరు చేసి ఆదుకుంటున్నామని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఓబిలిలోని ముస్లిం మహిళలు 28 మందికి తహసీల్దార్ కార్యాలయంలో పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబిలి గ్రామం అనుకొని సర్వేనెంబరు.178లో 28 మంది ముస్లిం కుటుంబాలకు, స్థలాలు లేని వారికి వీఆర్‌ఓలు ద్వారా ఎంక్వైరీ చేసి నిజమైన బాధితులకు ఇంటిపట్టాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వంలో ఇంటిపట్టాలు కావాలంటే కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు ఇళ్ల చుట్టూ తిరిగి పక్కాగృహాలు, ఇంటి పట్టాలు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్ రావు, రెవెన్యూ సిబ్బంది, ఓబిలి సర్పంచ్ బాషా, మండల కో–ఆప్షన్ మెంబర్ లాడెన్ (మాహబూబ్‌బాషా) తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలివ్వాలి

లక్కిరెడ్డిపల్లె : ఇంటర్ విద్యార్థులకు ఇంటర్ బోర్డు వారే పాఠ్యపుస్తకాలను ఉచితంగా ఇవ్వాలని పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలోని శ్రీ వెంకటేశ్వర ఎయిడెడ్ కళాశాల ప్రాంతంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించాలన్నారు. పేద విద్యార్థులకు పుస్తకాలు కొనుగోలు భారం మోపకుండా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండల నాయకులు హేమంత్ కుమార్, కాశీ, నవీన్, వెంకటేష్, ప్రకాష్, ఆంజనేయులు, రవి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ ఆరోగ్య కేంద్రంలో ఆధ్యా హెల్త్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన స్పెషలిస్టు వైద్యులచే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె, ఎముకలు, కీళ్లకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

రేపు గాలివీడులో ఉచిత వైద్య శిబిరం

గాలివీడు : జులై 2వ తేదీ ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్.ఎం.డి. జైద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడపకు చెందిన లైఫ్ లైన్ ఆసుపత్రి, అమీన్ మెడికల్స్ షాపు, సఫా ల్యాబ్‌ల ఆధ్వర్యంలో ఉచిత మెగా క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రబ్బాని, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ ఇమామ్ సాదిక్, డాక్టర్ షేక్ సోఫియాల పర్యవేక్షణలో షుగర్, బీపీ, గుండె, చెవి, ముక్కు, గొంతు, కళ్లకు సంబంధించిన సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తారన్నారు.

నేటి నుంచి జగనన్న సురక్ష

రామాపురం/పుల్లంపేట/ఒంటిమిట్ట/చిన్నమండెం : నేటి నుంచి జరిగే జగనన్న సురక్ష పథకంలో లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తెలిపారు. నెల రోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. సర్వేలో గుర్తించిన అందరికీ ధృవీకరణ పత్రాలు అందుతాయన్నారు. ప్రతి రోజు గ్రామాలలో శిబిరాల నిర్వహించి లబ్ధిదారులకు టోకెన్‌ల ఆధారంగా పత్రాలు అందజేయనున్నారు. మధ్యాహ్నం సమయంలో శిబిరాల వద్ద భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఊరూరా జరిగే కార్యక్ర మంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొనాలని వారు కోరారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైవీయూ పరీక్షా కేంద్రాల తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల సెమిస్టర్ పరీక్షలను వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, రాజంపేటలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు.

అందరి సమన్వయంతోనే మండలాభివృద్ధి


సమావేశంలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ

గాలివీడు : అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సాధారణ సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులతో చర్చించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో మంచినీరు, వైద్యం, అభివృద్ధి వంటి శాఖలపై సమీక్షించి గ్రామ సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులను కలుపుకొని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని తెలిపారు. గోపనపల్లె సర్పంచ్ చెన్నకేశవరెడ్డి గ్రామాలల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు అందిస్తున్నారని, సంబంధించిన పౌష్టికాహారం వివరాలను స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని సభ ద్వారా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దృష్టికి తీసుకొచ్చారు. వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ గడప గడప కార్యక్రమంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని అధికారులు ఎరువులు, మందులను రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు పంటలపై అవగాహన కల్పించాలని వైస్ ఎంపీపీ వ్యవసాయ అధికారులను కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై స్థానిక సర్పంచ్‌లు, అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ తిమ్మారెడ్డి, వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ముదురు మామిడిలో కొమ్మలు కత్తిరించాలి

లక్కిరెడ్డిపల్లె : ముదురు మామిడిలో కొమ్మలు కత్తిరింపులు చేపట్టాలని ఉద్యాన అధికారిణి టి.నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం దిన్నెపాడు గ్రామంలోని రైతులకు మామిడి పంటలో కాయల కోత తరువాత ఆచరించాల్సిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మామిడిలో కాయలు కోసినప్పటి నుండి తగు జాగ్రత్తలను పాటించినట్లైతే నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. కొమ్మ కత్తిరింపులు ఎప్పుడు ఎలా చేయాలో సూచించారు. అనంతరం చేయాల్సిన సస్యరక్షణపై వివరంగా తెలియజేశారు. ప్రతి మామిడి రైతు డ్రిప్ పద్ధతిని పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది పవన్, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

జనజాగృతి సభను విజయవంతం చేయండి

చిన్నమండెం/సంబేపల్లె : ఈ నెల 7న విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో ఎస్సీ వర్గీకరణ కోసం జరిగే మాదిగల జనజాగృతి సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ చిన్నమండెం, సంబేపల్లె మండలాల నాయకులు కోరారు. శుక్రవారం కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 29వ వార్షికోత్సవం సందర్భంగా జనజాగృతి సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ కోసం పోరాడుతున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. వర్గీకరణను సాధించే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వర్గీకరణకు మద్దతు ప్రకటించిందని, చిత్తశుద్ధితో పని చేసి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే మాదిగలతో ఇతర కులాలను మోసగించిన వారవుతారని తెలియజేశారు. సభకు రెండు మండలాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మలిశెట్టికి సన్మానం


మలిశెట్టిని సన్మానిస్తున్న తానా ప్రతినిధులు

రాజంపేట : ఈడిగపాళెంకు చెందిన సీనియర్ జర్నలిస్టు, ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నేత మలిశెట్టి సుబ్బరాయుడుని వాషింగ్టన్ డీసీలో తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిలు ఘనంగా సత్కరించారు. జులై 7, 8, 9లలో మహాసభలు జరుగనున్నాయి. సీనియర్ జర్నలిస్టు మలిశెట్టిని సన్మానించడం ఆనందదాయకమని వారు తెలిపారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

రాజంపేట : అఖిల భారత పద్మశాలి బహుత్తమ సంఘం (కొత్తబోయనపల్లె) ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం బోయనపల్లె గ్రామానికి చెందిన పద్మశాలీయులు ధర్నా నిర్వహించారు. తమ గ్రామంలో శ్మశాన వాటిక, బస్టాండు స్థలం, భావనరుషి దేవస్థానానికి చెందిన స్థలాలను పరిరక్షించాలని కోరుతూ ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు.

ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

రామాపురం : మృతి చెందిన ఉపాధి కూలీ పద్మావతమ్మ కుటుంబాన్ని శుక్రవారం సీపీఐ నాయకులు పరామర్శించారు. ప్రభుత్వం మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు జరిగే చోట ప్రభుత్వం భద్రతా ప్రమాణాలు పాటించాలని తెలియజేశారు.